# కౌసిని వోరలికి గొబ్బిళ్లో...

**-మల్లాది రవిశంకర్**

పుష్యమాసం. చీకటి పూర్తిగా వీడలేదు. దానికోతోడు కొంచెం దట్టంగా పొగమంచు క్రమ్ముకోవటంతో ఉషోదయం ఛాయలే అగుపించటం లేదు. రైలు రెండు గంటలు ఆలస్యంగా వస్తుందని ఎనౌన్స్‌మెంట్ వినిపించటంతో విసుగ్గా బయటకి వచ్చాను, నగరం గాఢనిద్రలో వుంది. ఎగ్జిట్ డోర్ దగ్గర టికెట్ కలెక్టర్ సన్నగా గురకపెట్టి కుర్చీలో కూర్చునే కునుకు తీస్తున్నాడు. పల్లెటూరు నుండీ చిన్నాన్న కొడుకు వస్తున్నాని ఫోన్ చేసి మరీ చెప్పటంతో, ఇంత తెల్లవారుఝామునే స్టేషన్‌కి రాక తప్పలేదు.

వాడికి సిటీ కొత్త. చలిగాలి ముఖానికి బలంగా తగలటంతో, అసంకల్పితంగా జేబులు తుడుముకున్నాను. సిగరెట్ పెట్టె, లైటర్ చేతికి తగలటంతో నిశ్చింతగా 'అమ్మయ్య!' అనుకున్నాను. చిన్నప్పుడు చదువుకున్న పద్యం గుర్తుకొచ్చింది.

'శంభు కంటనొకటి, జలరాశినొక్కటీ
మరియు నొకటి మనుజ మందిరములనొదిగె..'

అంటూ శీతాకాలం ధాటికి అగ్ని, శివుని మూడవ కంటిలోనూ, జలరాశి అయిన సముద్రంలోనూ, మనుషులు ఇళ్ళలోనూ దాక్కుందని ఒక కవి వర్ణన.

ఈ పద్యం గుర్తొచ్చినప్పుడల్లా నాకనిపిస్తుంది. అగ్ని నాలాంటి ధూమపాన ప్రియుల జేబుల్లో కూడా దాక్కుందని...అలా అనుకుంటూ అలవాటైన బలహీనతని మెల్లగా బయటికి తీసి, ప్రేమగా నిమిరి, తన్మయంగా పెదవుల మధ్య పెట్టుకుని, వడుపుగా నిప్పంటించి తమకంగా దమ్ములాగి, రింగులుగా పొగ బయటకి వదిలాను. నగరం ఇంకా సుషుప్తిలోనే ఉంది. టికెట్ కౌంటర్‌కి అడ్డంగా చాలామంది ప్రయాణీకులు వాళ్ళ సంచీలు, పెట్టెలూ తలక్రింద పెట్టుకుని ముడుచుకుని పడుకున్నారు.

అక్కడ సరిగా నుంచోటానికే ప్లేస్ లేకపోవటమే కాకుండా, పక్కనే ఉన్న యూరినల్స్‌నుండి ఘాటైన దుర్వాసన వస్తుండటంతో, వెళ్లి కార్లో కూర్చోటమే ఉత్తమం అని పార్కింగ్ వైపు నడిచాను. పార్కింగ్ ప్లేస్‌కి దగ్గర పేవ్‌మెంట్ మీద నుండి వినిపించిన మాటలు నా దృష్టిని ఆకర్షించాయి.

"అవ్వా! ఇంకా లేవమంటావా? గొబ్బిళ్ళు పెట్టాలికదా!" అని ఓ చిన్నారి అడుగుతోంది.

కార్ పార్కింగ్ దగ్గరికి చేరుకొని పార్క్ చేసిన నా కారుని ఆనుకుని ఆసక్తిగా వాళ్ళని గమనించసాగాను.

"నాలుగున్నర దాటుతోంది. ఇంకా లేచెయ్ తల్లీ!" అంటూ చిన్నారి మనవరాల్ని అనుకుంటా లేపుతూ ఒక అవ్వ తను కూడా లేచి కూర్చుంది. వయసు అరవైదాకా ఉండచ్చు.

గులాంరంగు ముతక చీర కట్టుకుంది. కొంచెం నలుపూ, ఎక్కువ తెల్లగా ఉన్న ఆమె జుట్టూ.

ఆమె ఏడేళ్ల మనవరాలు అనుకుంటా నిద్రలేచినట్టే లేచి, చలిగాలికి మళ్ళీ ముడుచుకొని అవ్వ ఒళ్ళో వొదిగిపోయింది.

"అలా పడుకుంటే ఎలా తల్లీ! గొబ్బిళ్ళు పెడతానంటూ ఆవుపేడ తెచ్చుకున్నావు. ఇంకో పది రోజులు పెట్టావంటే సంకురేతిరి పండుగ రానే వస్తుంది. చలంటూ ఇలా గువ్వలా పడుకుంటే ఎలా అమ్మా! నమ్మకంతో గొబ్బిళ్లు పెడితే మంచి మొగుడొస్తాడు. మరి లే అమ్మా!" అని మనవరాలి నిద్రమత్తు వదిలించాలని చూస్తోంది అవ్వ.

"మొగుడొద్దవ్వా! నేను పెద్ద చదువులు చదివి, ఆఫీసర్నయి, నిన్ను అదిగో...అలాంటి పెద్ద కారులో ఎక్కించుకొని ఊరంతా తిప్పుతాను" అంటూ నా కారువంక వేలుతో చూపించింది. గోరంత గుండెల్లో, కొండంత ఆశ ఆమె మాటల్లో కనిపించింది.

మురిపెంగా మనమరాలి తల నిమిరి, "మరి తొందరగా తెములు" అంటూ మనమరాల్ని తొందర చేసింది అవ్వ.

చూస్తుండగానే వాళ్ళిద్దరూ అప్పటిదాకా పడుకున్న పేవ్‌మెంట్‌ని నీళ్ళతో కడిగి శుభ్రం చేశారు.

"ఈరోజే ముగ్గేస్తావ్ అవ్వా!" అంటూ అడిగిన మనవరాలికి, "కాకరపువ్వుల ముగ్గేసేద్దాం. పదకొండు నుండీ ఏడుదాకా చుక్కలు పెట్టెయ్" అని పురమాయించి, తను గొబ్బిపేడని తయారు చెయ్యడంలో నిమగ్నమయింది.

"నిన్న తెచ్చిన గుమ్మడిపువ్వు బకెట్‌లో వేశాను. దాన్ని బయటకి తీసి ఉంచు. మళ్ళీ రద్దీ పెరిగితే పోలీసోళ్ళొచ్చి కిరికిరీ పెడతారు. ఈ లోపుగానే గొబ్బిళ్లు పెట్టేయాలి" అని హడావిడి చేస్తోంది అవ్వ.

చూస్తుండగానే అవ్వా, ఆమె మనమరాలూ కాకరపూల ముగ్గులో గొబ్బిళ్లు, గొబ్బిమీద గుమ్మడిపూవుతో సహా అన్నీ పెట్టేశారు. అవ్వ ఊడిన తొర్రిపళ్ళ మధ్యనుండీ గొబ్బిపాట పాడుతుంటే మనుమరాలు గొబ్బిళ్లచుట్టూ గంతు లేస్తూ తిరుగుతోంది ముసి ముసి నవ్వులతో. తొలి సూర్యకిరణం మంచుని చీల్చుకొని నగరంలో జరుగుతున్న గొబ్బి ముచ్చట్లు చూడాలని విఫలప్రయత్నం చేస్తోంది.

గొబ్బెమ్మలకి పటికబెల్లం నైవేద్యం పెట్టి, గొబ్బి పిడకని దగ్గర్లో ఉన్న గోడకి కొట్టేశారు మళ్ళీ పోలీసోళ్ళు కిరికిరికి భయపడి.

"ఆ ఎండిన గొబ్బిపిడగలని వెలిగించి, దాని మీద కొత్త బియ్యం, బెల్లంతో తియ్యని పొంగలి చేసేవాళ్ళం మనూళ్లో ఉండగా. నీ అయ్య కరెంటు షాక్ తగిలి చచ్చిపోవటం, ఆ దిగులుకి నీ అమ్మ కృష్ణలో దూకి చావటం, చేసిన అప్పులకి షరాబు ఇంటిని జమ చేసుకోవటంతో ఇదిగో, ఇలా నగరం రోడ్లమీద పడ్డాం" అని

తనలో తను అనుకున్నట్టుగా కొంచెం పెద్దగా సణుక్కున్న అవ్వ మాటలు నా చెవిన పడ్డాయి. వాళ్ళ పేద కథ నాకర్థమయిపోయింది. సిరిపోయినా, ఇంకా మర్చిపోలేని పండుగ హంగులమీది వాళ్ళ మమకారం.కాలగర్భంలో కలిసిపోతున్న ఎన్నెన్నో మన పండుగలు. నా చిన్నతనంలో అట్లతద్దీ, ఆండాళ్ళ తద్దీ, చివరికి భగినీ హస్త భోజనం కూడా మాకు పెద్ద పండుగలే. అట్లతద్దీ, ఉండ్రాళ్ల తద్ది వచ్చిందంటే ముందురోజు రాత్రే అమ్మ చద్దన్నం, కంది పచ్చడీ, గోంగూర పచ్చడీ, వెన్నా, గడ్డ పెరుగూ తయారుగా ఉంచేది. పూర్తిగా నాలుగు కాకుండానే నిద్రలేచి, హడావిడిగా ముఖాలు కడుక్కొని స్నానం చెయ్యకుండానే కొత్త బట్టలు దిగేసుకునేవాళ్ళం. అమ్మ చద్దన్నంలో కంది పచ్చడి కలిపి, గోంగూర పచ్చడీ, వెన్నా, పేర్నెయ్యా నంచిపెడుతుండగానే, మా కోతుల గ్యాంగ్ లీడర్ శేఖరాయ్...

"ఆలింకాలింకా! చంద్రాబాలింకా!" అని గొంతెత్తి వీధి వాకిట్లోంచి అరచీ అరవంగానే వాడి గొంతుకి గొంతులు కలిపి, సరిగా చేతులు కూడా కడుక్కోకుండా పరిగెత్తుకెళ్లి దొరగారి తోటలోకి చేరుకునేవాళ్ళం.

నీలాకాశం కింద, చందమామ కురిపిస్తున్న వెన్నెల సోనల మధ్య, చుక్కలు ప్రేక్షకుల్లాగా తిలకిస్తుంటే, ఆటలు ఆడేవాళ్ళం పాటలు పాడేవాళ్ళం. ఇక ఆడిపిల్లలంతా పట్టుపావడాలు సింగారించుకొని, రాణీగారి తోపులో మామిడి చెట్లకి ఉయ్యాలలు కట్టుకొని, పోటీలు పడి ఊగుతూ, మధ్య మధ్యలో గోరింటాకు ఎలా పండిందని స్నేహితురాళ్ళతో ముచ్చట్లాడుతూ, కిలకిల్లాడుతూ గడిపేసేవాళ్ళు. ఇక సంక్రాంతి వచ్చిందంటే చలిగాలికి దడవకుండా ఒకర్ని మించి ఇంకోరు దుప్పట్లు కప్పుకొని మరీ ముగ్గులు వేసేవాళ్లు. బొమ్మల కొలువులూ, కొత్త వడ్ల కంకుల్నించీ గింజల్ని పీక్కుతినే పిచ్చుకల కిచకిచలూ, రకరకాల పిండివంటల ఘువంఘువంలూ....ఆ రోజులే వేరు! ఇక భగినీ హస్త భోజనం..




‘ఈ’ అనే పుట్టింటినుండీ, ‘ఆ’ అనే అత్తవారింటికి వెళ్ళిన తోబుట్టువు దగ్గరకి ‘అ’ అనే అన్న సంవత్సరంలో తప్పనిసరిగా ఈరోజు పుట్టింటి పసుపుకుంకుమలతో వెళ్ళి, ఆమె ఆదరంగా చేసి పెట్టిన ‘అ’కారంతో మొదలయ్యే అద్భుత రుచుల అన్నాలనీ, వంటకాల్నీ ఆరగించి, అమ్మా! ఏ కష్టం వచ్చినా ఈ అన్నని గుర్తుంచుకో తల్లీ! కాకిచేత కబురంపినా, నీ ముంగిట్లో వాలతానమ్మా! అని భరోసానిచ్చే అరుదైన, అపురూపమైన, భావగర్భితమైన పండుగ ఇది. ఈ పండుగదినం ఏ ఇంట చూసినా అన్నలే అగుపించేవారు. ఇలా ప్రతిపండుగా, పబ్బం కూడా మాకు అపురూపమైనవే!

తెలతెలవారుతున్న ఈరోజు మళ్ళీ ఈ అవ్వా, ఆమె మనవరాలూ ఆ రోజుల్ని గుర్తుకి తెచ్చారు. యాంత్రికమైన జీవితాలలో ప్రతి మనిషీ డబ్బులు సంపాదించే యంత్రంగా మారిపోతున్నారు. నేనూ ఆ తానులో ఒక పీలికనే!పల్లెని వదిలి, బ్రతుకు పోరాటంకోసం పట్న వీధులని ఆశ్రయించిన ఒక అవ్వా, ఆమె చిన్నారి మనవరాలు.



## రొమాంటిక్ కిమ్

కిమ్ శర్మ గతంలో ‘ఖడ్గం’ సినిమాలో కనిపించింది. మళ్లీ ఇన్నాళ్లకి తెలుగు తెరపై ‘యాగం’ ద్వారా వస్తోంది. కిమ్ శర్మ అంటేనే హాట్ హాట్ పోజులుంటాయని ప్రేక్షకులకు బాగ తెలుసు. తాజాగా ‘యాగం’ సినిమాలోనూ కిమ్ అందాల ఆరబోత ప్రేక్షకులకు కనువిందు చేయబోతోందని ఫిలింనగర్ జనాల ఉవాచ. కుర్రహీరో నవదీప్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో అసలు హీరోయిన్ భూమిక. కిమ్ శర్మ మరో ముఖ్యపాత్ర పోషిస్తూ రొమాంటిక్ పోజులిస్తోందన్నమాట.




కూటికోసం కూలికోసం పట్టణంలో బ్రతుకుదామని, పల్లెసీమల్ని వదిలి వచ్చిన ఒక చిన్న చితికిన కుటుంబం నా కళ్ళముందు అగుపిస్తోంది.

దాదాపు పాతిక సంవత్సరాలక్రితం నేనూ ఇలాగే ఈ నగరంలో అడుగు పెట్టాను అనాథగా, దిక్కులేని వాడిగా! కష్టం చాలా పాఠాలు నేర్పింది. బ్రతుకు పోరాటం ఈదటం నేర్పింది. ఆకలిని తట్టుకోవటం నేర్పింది. డబ్బు సంపాదించటం నేర్పింది. నలుగుర్ని ఆదుకుని చేయూతనివ్వటం నేర్పింది. పనిచెయ్యటం నేర్పింది. పని చేయించటం నేర్పింది. మంచీ చెడూ విచక్షణా నేర్పింది.ఎందుకో నెలలనుండీ ఖాళీగా తాళం వేసిఉన్న నా అవుట్‌హౌస్ గుర్తొచ్చింది ఈ క్షణం.ఆ చిన్నారి గుండెల్లో చదువుకోవాలనే కోరికా, ఎదగాలనే పట్టుదల, ఆరాటం, పసితనం వదలని ఆమె ముఖం, ఉత్సాహంగా ఆమె చేసిన గొబ్బి పూజలూ నాకు ముచ్చటగా అనిపించాయి. ఆ చిరుదీపాన్ని నేను వెలిగించలేనా? అస్తమించే వయస్సులో, కొడిగడుతున్న దీపంలాంటి ఈ అవ్వ ఎప్పుడయినా ఈ చిన్నారికి దూరం కావచ్చు. అప్పుడు ఈమె ఈ మహానగరంలో బ్రతకగలదా? ఆమె పెద్ద చదువులు చదవాలి, చిన్న కారుల్లో తిరగాలనే గోరంత కోరికని నిజం చేసుకోగలదా? ఒంటరి పోరాటం సాగించగలదా? గెలిచి గర్వంగా నిలబడగలదా? లేక ఓడిపోయి జీవచ్ఛవంలా మిగిలిపోతుందా? ఏమో! ఒక నిర్ణయానికి రావటానికి అంత సమయం పట్టలేదు. అవ్వ దగ్గరకెళ్ళాను.

“అవ్వా! నీ మనవరాలిచేత నా ముంగిట్లో కూడా గొబ్బిళ్లు పెట్టిస్తావా? ప్రతిఫలంగా నా ఇంట్లో మీ ఇద్దరికీ ఉండటానికి గదిస్తాను. నీ మనవరాల్ని స్కూల్లో చేర్పిస్తాను. చదువుకున్నంత చదివిస్తాను. మరి నాతో వస్తారా?'' అని అడిగాను. అవ్వ అనుభవం జోడించిన అనుమానంతో నావంక చూసింది. భరోసా ఇస్తున్నట్టుగా నవ్వాను.

“ఎందుకు మా కోసం ఈ సహాయం'' అని డైరెక్టుగా అడిగేసింది అవ్వ.

ఆమెకు నా గురించి అంతా చెప్పేశాను. అర్థం అయ్యేటట్టుగా చెప్పాను. కష్టపడి పైకొచ్చిన నా గతం గురించి చెప్పాను. మీకూ, నాకూ కామన్ ఏమిటంటే నేటి ‘మీ’ నిన్నటి ‘నా’ పేదరికమే అని వివరంగా చెప్పాను.

“మరి మీ ఆవిడ మమ్మల్ని ఇంట్లోకి రానిస్తుందా?'' అవ్వ అనుమానం.

నా భార్యా, పిల్లలూ నా మాట జవదాటరని చెప్పాను. నా భార్య కూడా ఒక అనాథగా ఉండేదనీ, ఆశ్రమంలోంచి పెళ్ళి చేసుకున్నానని ఇప్పుడే చెప్పదలుచుకోలేదు. అవ్వ కళ్లల్లో మంచు ముత్యాలలాంటి కన్నీళ్ళు. గొంతు పెగల్చుకొని అవ్వ చెప్పింది.

“అయ్యా! మేమూ ఒకప్పుడు బ్రతికి చెడ్డవాళ్ళమే. ఆరోజు పాడిపంటల మధ్య కష్టం తెలీకుండా ఉన్న మమ్మల్ని విధి ఇలా వీధికీడ్చింది. ఇలా వీధిలో ఉన్నా, ఉన్న ఈ గడపకూడా మన స్వంతమే అన్నట్టుగానే నా మనవరాలిచేత గొబ్బిళ్ళు పెట్టించాను. రోడ్డు మీద చెత్తకుప్పల్లా పడివున్న మాలాంటి అనామకులకు దారి చూపించాలనే నీ దొడ్డ మనసుకు దణ్ణం పెడుతున్నాను. నా కొడుకే బ్రతికుంటే, ఇప్పుడు నీ వయస్సులోనే ఉండేవాడు. నా కొడుకులాంటి నీకు దణ్ణంపెట్టి నీ ఆయుఃక్షీణం చెయ్యను. కానీ ఒక భరోసా తప్పకుండా ఇస్తాను. నేనూ, నా మనవరాలూ మీ ఉన్నతికి మా చర్మం వలిచి చెప్పులు కుట్టిస్తాం. మీలాంటి ధర్మ ప్రభువులవల్లే ఇంకా మంచికి రోజులున్నాయ్'' అంది దుఃఖం నిండిన గొంతుకతో.

“తొందరగా మీరు తీస్కెళ్ళాల్సిన సామానేమయినా ఉంటే సర్దుకోండి. పది నిమిషాల్లో స్టేషన్‌లోకెళ్ళి వస్తాను'' అని వాళ్లకి చెప్పి, స్టేషన్‌లోకి దారి తీసాను. ఏదో ఒక మంచిపని చేస్తున్నాననే నమ్మకాన్నీ, సంతృప్తినీ గుండెల్లో నింపుకొని.

★